నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, మంగళవారం 11 మార్చి 2025 HYDERABAD

## కంటోన్మెంట్ బోర్డు విలీన ప్రక్రియ షురూ




సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): కేంద్ర రక్షణ శాఖ ఆధీనంలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియలో ఎట్టకేలకు చర్యలు మొదలయ్యాయి. ఈ మేరకు పలువురు కంటోన్మెంట్ అధికారులు సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రధానంగా భూ సేకరణపై చర్చించినట్లు సమాచారం. కాగా కంటోన్మెంట్ బోర్డు పరిధి మొత్తాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రధానాంశాలపై అధ్యయనం చేసేందుకు కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ కమిటీలోని ఉభయ శాఖల అధికారులు కంటోన్మెంట్ బోర్డు విలీనంలో భాగంగా జీహెచ్ఎంసీ అప్పగించనున్న రోడ్లు, ఇతర పౌర సేవల నిర్వహణ అంశాలతో పాటు ఇతర అంశాలను అధ్యయనం చేయనున్నట్లు సమాచారం.



మానవ అక్రమ రవాణాకు గురైన నలుగురు బాధితులను రక్షించి సురక్షితంగా స్వదేశానికి రప్పించడంలో కృషి చేసిన ఫిల్మ్‌నగర్ పీఎస్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పంజాగుట్ట పీఎస్ మహిళా కానిస్టేబుల్ నేనావత్ లావణ్యను సోమవారం సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు.
-సిటీబ్యూరో, మార్చి 10(నమస్తే తెలంగాణ)

# కరెంట్ పోయింది!

### వెల్లువెత్తుతున్న నెటిజన్ల ఫిర్యాదులు
### గంటల తరబడి పోతుందంటూ ఆగ్రహం
### విద్యుత్ సిబ్బంది స్పందించడం లేదంటూ పోస్టులు

సిటీబ్యూరో, మార్చి 10 (నమస్తే తెలంగాణ): 24 గంటల విద్యుత్ సరఫరా.. కరెంట్ కోతలకు ఆస్కారమే లేదు.. ఇది రేవంత్ సర్కార్ వేదికలపై చెప్పే కోతల మాట.. కోతలే లేవు.. ఎంత డిమాండ్ వచ్చినా సప్లైలో అంతరాయముండదు.. ఇది దక్షిణ డిస్కం ఉన్నతాధికారుల నమ్మకమైన మాట.. కానీ క్షేత్రస్థాయిలో ఇవన్నీ అబద్ధాలని తేలింది. సోషల్ మీడియా వేదికగా కరెంట్ కోతలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కరోజులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సిబ్బంది సతమతమవుతున్నారు. లోడ్ పెరిగితే సప్లైలో కొంత సమస్యలుంటాయని విద్యుత్ రంగనిపుణులు మొదటి నుంచి హెచ్చరిస్తున్నా.. సర్కార్ మాత్రం వారి మాటలను పెడ చెవిన పెట్టి అత్యుత్సాహంతో, అధికార దర్పంతో తమదైన ధోరణిలో ప్రజలను తమ 24 గంటల మాటలతో మభ్యపెట్టి మాయ చేయాలని చూసింది. కానీ ఆ మాయలు పటాపంచలయ్యాయి. ఒక్కరోజులో కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక జనం ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ప్రారంభంలోనే ఈ కరెంట్ కోతలేంటంటూ మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో లేని పవర్‌కట్స్ ఇప్పుడు ఎలా వస్తున్నాయంటూ విద్యుత్ అధికారులను నిలదీస్తున్నారు. దీంతో కరెంట్ కోతలే లేవని చెప్పిన సర్కార్ కోతల మాటలను ఇప్పుడు నమ్మే పరిస్థితి పోయింది. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి, అర్ధరాత్రి.. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడపడితే అక్కడ కరెంట్ తీసేస్తున్నారు. దీనిపై ఒక్క సోమవారమే ఎక్స్ వేదికగా నెటిజన్ల ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మూడురోజులుగా ఈ కోతలపై నెటిజన్లు స్పందిస్తూ ఫిర్యాదులు చేస్తూనే ఉన్నప్పటికీ సోమవారం ఈ తీవ్రత మరింత పెరిగింది.

**ఒక్కరోజులో వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు..**

ఎక్స్ వేదికగా పలువురు నెటిజన్లు వివిధ ప్రాంతాల్లో కరెంట్ పోయిందంటూ అనేకచోట్ల నుంచి ఫిర్యాదులు చేశారు. టోలీచౌకిలో పోడియం మాల్ బ్యాక్ సైడ్ ప్రతీరోజు ఉదయం కరెంట్ పోతున్నదని ముబషీర్‌అలీ, షేక్‌పేట్ ఏరియాలోని హమ్రా కాలనీలో ఉదయం నుంచి కరెంట్ లేదంటూ మహీంద్ర ఫిర్యాదులు చేశారు. మీరాలం ప్రాంతంలో రెండు గంటలుగా కరెంట్ లేదని, తాను ఫిర్యాదు చేద్దామని ప్రయత్నిస్తే ఎవరూ అందుబాటులో లేరంటూ ఫిర్యాదు చేశారు. అయితే ఉదయం, సాయంత్రం వేళల్లో కరెంట్ పోవడం ఒక ఎత్తు అయితే.. తెల్లవారుఝామున, అర్ధరాత్రి సమయాల్లో కరెంట్ పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు ఈ పోస్టుల ద్వారా తెలుస్తోంది. అయితే ఎక్కడా కరెంట్ కోతలు లేవని, ఎక్కడైనా కోతలు ఉంటే వెంటనే తమ నోటీసుకు వస్తాయంటూ ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారులు ప్రకటిస్తున్నా.. ఆ పరిస్థితి మాత్రం క్షేత్రస్థాయిలో లేదని ఈ పోస్టుల ద్వారా అర్థమవుతున్నది. మరోవైపు కొందరు వినియోగదారులు తాము ఫిర్యాదు చేయగానే వ్యక్తిగత సమాచారం అడగడంతో విద్యుత్ అంతరాయం ఉన్న ప్రాంతం చెప్పినా తమను వ్యక్తిగత సమాచారం ఎందుకు అడుగుతున్నారంటూ మండిపడ్డారు. ఇంకా వేసవి కాలం మొదలే కాలేదు.. ఇప్పుడు ఇంత ఇబ్బంది ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితేంటంటూ సీఎంకు, టీజీఎస్‌పీడీసీఎల్‌కు ట్యాగ్ చేస్తూ ఫిర్యాదు చేస్తున్నారు.




కరెంటు పోయిన వెంటనే ఎక్స్‌లో ఫిర్యాదుల వర్షం కురిపిస్తున్న నగర వాసులు

**సాంకేతికతతో లోపాలు గుర్తించి.. పరిష్కారం**

**-టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి**

విద్యుత్ సరఫరాలో లోపాలను త్వరగా గుర్తించి సకాలంలో పరిష్కరించే ఉద్దేశంతో టీజీఎస్‌పీడీసీఎల్ తన పరిధిలోని 11 కేవీ ఫీడర్లలో ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాంకేతికతను అమలు చేస్తున్నామని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి తెలిపారు. ఈ టెక్నాలజీ ద్వారా ఫీడర్‌లో దెబ్బతిన్న ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించవచ్చని, లోపం ఎక్కుడుందో సులభంగా గుర్తించడానికి వీలుగా జీఐఎస్ డేటాను సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కు సాసా యాప్‌కు బజర్ సౌండ్ ద్వారా అప్రమత్తం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని 11 కేవీ ఫీడర్లు 8621లలో ఈ సాంకేతికతను పొందుపరుస్తున్నామని, ప్రస్తుతానికి 4433 ఫీడర్ల పరిధిలో పొందుపరిచినట్లు తెలిపారు. మిగిలిన ఫీడర్లకు మార్చి నెలాఖరునాటికి ఈ సాంకేతికతను పొందుపరుస్తామని ఫరూఖి తెలిపారు. అన్ని సర్కిళ్ల, జోన్ల ఎస్ఈలు, సీఈలతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎండీ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి సీజన్ పీక్ స్టేజ్‌లో ఉన్నదని, డిమాండ్ 17వేల మెగావాట్లకు చేరువలో ఉన్నదన్నారు. ఈ సీజన్‌లో 10వేల మెగావాట్లకు మించి గరిష్ఠ డిమాండ్ రికార్డ్ అవుతోంది. ఈనెల 4న 10533 మెగావాట్ల రికార్డు స్థాయి పీక్ డిమాండ్, 5న 215.52 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్‌పీడీసీఎల్ పేర్కొంది.



## పారుతున్న మురుగు
### పని చేయని లిఫ్ట్

**గాంధీలో రోగుల ఇబ్బందులు**
**మంత్రి పర్యటించినా మారని తీరు**

సిటీ బ్యూరో/బన్సీలాల్‌పేట, మార్చి10, (నమస్తే తెలంగాణ): గాంధీ జనరల్ ఆసుపత్రి సమస్యలతో సతమతమవుతున్నది. ఆసుపత్రి ప్రాంగణంలో మురుగునీరు ప్రవహిస్తుంటే.. పై అంతస్తులకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు పనిచేయడం లేదు.. దీంతో రోగులు , వారి సహాయకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవలే వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీ ఆసుపత్రిలో పర్యటించినా.. కూడా తీరు మారకపోవడం గమనార్హం.

**బాగు చేయించడం విస్మరించారు..**

ప్రతి సోమవారం సుమారు 2వేల మంది ఔట్ పేషెంట్లు, మిగతా రోజుల్లో 1500 వరకు వస్తుంటారు. 1200 బెడ్ల సామర్థ్యం గల ఈ ఆసుపత్రికి స్థాయికి మించి ఇన్ పేషెంట్లు వచ్చి చికిత్స తీసుకుంటారు. రెండో అంతస్తులో ఉన్న చర్మ లైంగిక వ్యాధుల ఓపీ విభాగానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనిచేయడం లేదు. మొదటి అంతస్తులో ఉన్న పలు ఇనుప కుర్చీలు విరిగిపోయాయి.

**మురుగుతో దుర్వాసన**

200 పడకల సామర్థ్యంతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స కోసం వచ్చే బాలింతలు, గర్భిణుల కోసం వారి సహాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న సహాయకుల షెల్టర్ సరిపోకపోవడంతో ఆసుపత్రి బయటే రోజుల తరబడి ఉంటున్నారు. మరోవైపు ఆసుపత్రి నుంచి వెలువడే మురుగు నీరు పొంగి బయటికి రావడంతో ఆ పక్కనే విశ్రాంతి తీసుకుంటున్న సహాయకులు ముక్కులు మూసుకుంటున్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

**ఎమ్మెల్సీ కవిత**



ఓల్డ్ మల్లాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ కవిత

మల్లాపూర్: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్‌లో బీఆర్ఎస్ నేత హమలి సీనన్న ఆధ్వర్యంలో 500 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అంతకుముందు ఓల్డ్ మల్లాపూర్ లోని అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్సీ కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 14 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలు విసుగు చెందారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు డాక్టర్ చంద్రావతి, బీఆర్ఎస్ నేతలు తండా వాసు గౌడ్, మహిళా అధ్యక్షురాలు కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**శాంతిభద్రతలు అదుపుతప్పాయి..**

మెహిదీపట్నం: హైదరాబాద్ సిటీ స్మార్ట్ సిటీ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం నగరంలోని నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని, శాంతిభద్రతలు పూర్తి అదుపులో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత నగరంలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట నేరాలు జరుగుతూనే ఉన్నాయని, శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని చెప్పారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు ఆజం అలీ, సామ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీళ్లు వస్తలేవు

### కమిషనర్‌కు మున్సిపల్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత ఫిర్యాదు

ఘట్‌కేసర్, మార్చి 10: ఘట్ కేసర్ పట్టణంలో నెలకొన్న తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ నేత, మున్సిపల్ అధ్యక్షుడు మామిళ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఘట్ కేసర్ పట్టణ ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు సరిగ్గా లేక ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉందని, దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ ముదిరాజ్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు నాగరాజు, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు తదితరులు ఉన్నారు.



తాగు నీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేత ముత్యాలు యాదవ్ తదితరులు

## ఫుట్‌పాత్ వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు



**ఎమ్మెల్యే తలసాని**

బేగంపేట, మార్చి 10: నిరుపేదలైన ఫుట్ పాత్ వ్యాపారులను ఇబ్బందులు పెట్టడం అధికారులు మానుకోవాలని, లేకుంటే వారి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. సోమవారం రాంగోపాల్‌పేట, నల్లగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన ఫుట్‌పాత్ వ్యాపారులు, బల్దియాకు చెందిన షాపులలో అద్దెపై వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లి లోని కార్యాలయంలో కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడే వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు అద్దెలు పెంచుతామని అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పేద వర్గాలకు చెందిన ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో మోండా డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## నమ్మిస్తారు.. ముంచేస్తారు!

**నిరుద్యోగుల ఆశలు.. కంపెనీల మోసాలు**

సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను నకిలీ సాఫ్ట్‌వేర్ కంపెనీలు నిలువునా మోసం చేస్తున్నాయి. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నాయని, తమ వద్ద మూడు నుంచి ఆరునెలల పాటు శిక్షణ పొందితే ఆయా సంస్థల్లో జాబ్ గ్యారెంటీ అంటూ పలు కన్సల్టెన్సీలు నిరుద్యోగులను ఆకర్షిస్తున్నాయి. శిక్షణ పేరుతో ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 నుంచి 3లక్షల ఫీజు వసూలు చేసి కోట్లు దండుకున్నాక పత్తా లేకుండా పోతున్నాయి. నిరుద్యోగులు ఈ కంపెనీల మాటలు నమ్మి సెక్యూరిటీ డిపాజిట్ కింద డబ్బులు కట్టి నెలల తరబడి ఉద్యోగాల కోసం ఎదురు చూసి తీరా వారు మోసం చేశాక పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

**ఏడాదిలో 20కి పైగా కేసులు..**

నగరంలో బోగస్ కంపెనీల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నాయి. వీటి విషయంలో తీరా మోసపోయిన తర్వాత బాధితులు పోలీసులకు చెప్పడంతో ఒక్క ఏడాదిలో సుమారు 20కిపైగా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పోలీసులు నిరుద్యోగులను మోసం చేసిన కంపెనీలపై కఠినమైన కేసులు పెట్టడంతో పాటు వారు భవిష్యత్ లో వ్యాపారం చేయకుండా నిషేధించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. నగరంలో ఉన్న సాఫ్ట్ వేర్ కంపెనీల వివరాలు సేకరిస్తున్నారు. గతంలో నకిలీ కన్సల్టెన్సీ కేసుల్లో జైలు పాలైన కొందరు నిందితులు తిరిగి కంపెనీలు పెట్టి మోసం చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

**ఇటీవల జరిగిన సంఘటనలివే..!**

- ☞ నియొజెన్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ పేరిట కంపెనీ ప్రారంభించి జూనియర్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జాబ్స్ ఇస్తామంటూ నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.1 నుంచి రూ.2 లక్షల రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసింది.
- ☞ రెయిల్ వరల్డ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఒక్కో ఉద్యోగి దగ్గర రూ.40 నుంచి రూ.50వేలు వసూలు చేసి చేతులెత్తేసింది. ఇదే కంపెనీ గతంలో గచ్చిబౌలిలో మరో బ్రాంచ్ ఓపెన్ చేసి ఒక్కో ఉద్యోగి దగ్గర రూ.40వేలు వసూలు చేసింది. దేశవ్యాప్తంగా ఐదు బ్రాంచ్‌లు ఓపెన్ చేసి ఉద్యోగాలు ఇస్తామంటూ 800 మంది దగ్గర డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసింది.
- ☞ సినర్జీ యూనివర్సల్ కంపెనీ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ వర్క్ ఫ్రం హోమ్ పేరిట వసూళ్లకు పాల్పడి రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసింది.
- ☞ ఇన్ఫోహబ్ టెక్నాలజీస్ సంస్థ నిరుద్యోగుల నుంచి రూ.2 లక్షల చొప్పున రూ.16 కోట్లకు పైగా వసూలు చేసింది. సుమారు 800 మంది తాము మోసపోయామని గ్రహించి సంస్థపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- ☞ ధన్యన్ ఐటీ టెక్నాలజీస్ ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల చొప్పున సుమారు 200 మంది నుంచి రూ.4 కోట్లు వసూలు చేసి కంపెనీ మూసేశారు.
- ☞ గ్లోబల్ ఐటీ సొల్యూషన్స్ ఎమర్జింగ్ టెక్నాలజీలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ 80 మంది దగ్గర రూ.కోటిన్నర వసూలు చేసి ఆరు నెలల శిక్షణ తర్వాత ఉద్యోగాలు ఇస్తామంటూ చెప్పి రాత్రికి రాత్రే బిచానా ఎత్తేసింది.
- ☞ సాఫ్ట్ సొల్యూషన్ ఐటీ కంపెనీ శిక్షణ, ల్యాప్‌టాప్, సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కొక్కరి దగ్గర రూ.2లక్షల చొప్పున 150 మంది దగ్గర రూ.3కోట్లు వసూలు చేసి ఉడాయించింది.



### జీతాలు చెల్లించండి

మేడ్చల్ కలెక్టరేట్: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ.. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అలాగే గ్రామ పంచాయతీ కార్మికులకు 4 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ.. కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 4 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నట్లు కార్మికులు చెప్పారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్: వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## మల్లేపల్లిలో జాబ్ మేళా

సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగం కల్పించేందుకు మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఉపాధి కల్పనాధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 8328428933 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.